సాక్షి
మంచిర్యాల
ఆదివారం । 17 । నవంబర్ । 2024



బాసరలో ఉద్రిక్తత

బాసర ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తామని ఏబీవీపీ పిలుపునివ్వగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. శనివారం ఉదయం నుంచే నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 8లో▸



గతేడాది గందరగోళం..

గతేడాది పండించిన పత్తిని అమ్ముకునేందుకు రైతులు అరిగోస పడ్డారు. ఈ ఏడాదైనా కొనుగోళ్లు సజావుగా సాగుతాయో.. లేదో.. అని దిగులు చెందుతున్నారు. 9లో▸

గరిష్ఠం/కనిష్ఠం
30.0 /17.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. గాలిలో తేమశాతం పెరగనుంది. రాత్రివేళ, వేకువ జామున చలి తీవ్రత ఎక్కువగా ఉంటుంది.

మందుల కొరత తీరినట్లే..

- మంచిర్యాలలో సెంట్రల్ డ్రగ్‌స్టోర్
- మూడురోజులుగా హైదరాబాద్ నుంచి నేరుగా మందులు సరఫరా
- సత్వరమే జిల్లాలోని ఆస్పత్రులకు..
- ఇక రోగులకు మెరుగైన సేవలు



సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు వచ్చిన మందులు

మంచిర్యాలటౌన్: ఉమ్మడి జిల్లాలో ఆదిలాబాద్ కేంద్రంగా కొనసాగుతున్న సెంట్రల్ డ్రగ్ స్టోర్ (కేంద్ర ఔషధ గిడ్డంగి)ను ఎట్టకేలకు మంచిర్యాలలో ప్రారంభించారు. జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలో ఇటీవల తాత్కాలికంగా సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేశారు. ఇందులో ఇద్దరు ఫార్మసిస్టలను నియమించారు. మూడురోజులుగా హైదరాబాద్ నుంచి నేరుగా డ్రగ్ స్టోర్‌కు మందుల సరఫరా అవుతున్నాయి. వీటిని ఎంసీహెచ్‌లోని నాలుగు గదులు, వరండాలో భద్రపరిచారు. జిల్లాలోని ఆయా ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసేందుకు ఫార్మసిస్టులు శనివారం మందులు సిద్ధం చేశారు. సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌లో పూర్తి స్థాయి సిబ్బందిని నియమించి అన్ని రకాల మందులు సరఫరా చేసేందుకు తెలంగాణ రాష్ట్ర వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (టీజీఎంఎస్ఐడీసీ) ఏర్పాట్లు చేస్తోంది.

సిబ్బందిని నియమిస్తే పూర్తిస్థాయి సేవలు

జిల్లా పరిధి తక్కువగా ఉండడం, 80 కిలోమీటర్ల దూరంలోనే మారుమూల ప్రాంతాలు ఉండడంతో, అత్యవసర మందులను ఔషధ గిడ్డంగి నుంచి ఆయా ఆస్పత్రులకు పంపించడం సులభం కానుంది. మందులు సరఫరా చేసేందుకు ఒక వాహనాన్ని కూడా అద్దె ప్రాతిపదికన అందుబాటులోకి తెచ్చారు. వారంలో ఒకరోజు జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులను పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు. గతంలో మందుల కోసం 20 రోజులకు పైగా వేచి చూడాల్సిన పరిస్థితి ఉండగా, ప్రస్తుతం ఆ ఇబ్బందులు తీరనున్నాయి. ఆన్‌లైన్‌లో ఇండెంట్ పెడితే నేరుగా ఆయా ఆస్పత్రులకు మందులు సరఫరా చేసే అవకాశమేర్పడింది. సెంట్రల్ డ్రగ్ స్టోర్‌కు ఫార్మసిస్ట్ సూపర్‌వైజర్, ఫార్మసిస్ట్‌తో పాటు ఒక ప్యాకర్‌ను కేటాయించారు. మరో ఇద్దరు ప్యాకర్లతో పాటు డాటా ఎంట్రీ ఆపరేటర్‌ను నియమిస్తే సెంట్రల్ డ్రగ్ స్టోర్ సేవలు పూర్తిగా అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

నత్తనడకన భవన నిర్మాణం

మంచిర్యాల సెంట్రల్ డ్రగ్ స్టోర్ కోసం నస్పూరులోని కలెక్టరేట్ కార్యాలయం సమీపంలో రూ.3.5 కోట్లకు పైగా నిధులు వెచ్చించి భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. మూడేళ్లయినా నిర్మాణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. సొంత భవనం పూర్తయ్యే దాకా సెంట్రల్ డ్రగ్‌స్టోర్‌ను జిల్లా కేంద్రంలోని మాతా శిశు ఆరోగ్యకేంద్రంలోనే నిర్వహించనున్నారు. కాగా, ఈ కేంద్రానికి వచ్చే గర్భిణులు, బాలింతలకు ఇబ్బంది కలగకుండా ఖాళీగా ఉన్న గదులను మాత్రమే మందులు నిల్వ చేసేందుకు వినియోగిస్తున్నారు.

ఇండెంట్ అందిన వెంటనే..



జిల్లా కేంద్రంలోని ఎంసీహెచ్ ఆవరణలో ఏర్పాటు చేసిన సెంట్రల్ డ్రగ్ స్టోర్‌లో 400 రకాలకు పైగా మందులు రావాల్సి ఉండగా, 75 రకాలు మాత్రమే వచ్చాయి. మిగతావి ఇప్పుడిప్పుడే వస్తున్నాయి. వాటిని గదుల్లో ఆర్డర్ ప్రకారం సర్దుతున్నాం. ప్రభుత్వ ఆస్పత్రులకు సరఫరా చేసేందుకు వాహనాన్ని అద్దెకు తీసుకున్నాం. ఇండెంట్ రాగానే ఆయా ఆస్పత్రులకు వెంటనే మందులు పంపించే ఏర్పాట్లు చేస్తున్నాం. ఇక జిల్లాలోని ఆస్పత్రుల్లో మందుల కొరతకు ఆస్కారమే లేదు.

– శ్రీవాణి, ఫార్మసిస్ట్ సూపర్‌వైజర్, సెంట్రల్ డ్రగ్ స్టోర్, మంచిర్యాల

అందుబాటులో అన్ని మందులు

ఇప్పటివరకు ఆదిలాబాద్‌లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్ నుంచి జిల్లాలోని ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందులు సరఫరా చేసేవారు. మంచిర్యాల లాంటి దూరప్రాంతాలకు మందులు పంపించడంలో జాప్యం జరిగేది. కొన్ని రకాల మందులు జిల్లాకు సరఫరా చేయకపోవడంతో, మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి వారు వాటిని ఆస్పత్రి నిధుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. మిగతా ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు అవసరమైన మందులు అందేవి కావు. తప్పనిసరి పరిస్థితుల్లో రోగులు బయటి మెడికల్ షాపుల్లో కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. జిల్లాగా ఏర్పడిన ఎనిమిదేళ్ల తర్వాత మంచిర్యాలలో సెంట్రల్ డ్రగ్ స్టోర్ ఏర్పాటు చేయడంతో మందుల కొరత తీరినట్లేనని వైద్యులు భావిస్తున్నారు.



స్టోర్‌లో మందులు పరిశీలిస్తున్న ఫార్మసిస్టులు

న్యూస్‌రీల్

సర్వేలో ప్రతీ అంశాన్ని తప్పనిసరిగా పూరించాలి



పాతమంచిర్యాలలో సర్వే ప్రక్రియను పరిశీలిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్

మంచిర్యాలటౌన్: సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వే ప్రక్రియను నిర్దేశించిన నమూనాలో ప్రతీ అంశాన్ని పొందుపర్చాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. జిల్లా కేంద్రంలోని 3, 9, 15 వార్డుల్లో కొనసాగుతున్న సర్వే ప్రక్రియను మున్సిపల్ కమిషనర్ మారుతీప్రసాద్‌తో కలిసి శనివారం పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే ప్రక్రియలో భాగంగా ఎన్యుమరేటర్లు తమకు కేటాయించిన బ్లాక్‌లలోని కుటుంబ సభ్యుల వివరాలను పొరపాట్లు లేకుండా స్పష్టంగా నమోదు చేయాలని సూచించారు. సర్వే కోసం ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలోని ప్రతీ అంశాన్ని పూరించాలని తెలిపారు. తప్పులకు ఆస్కారం లేకుండా చూడాలని పేర్కొన్నారు. సర్వేకు ముందురోజునే ఆయా కుటుంబ సభ్యులకు సర్వేకు సంబంధించిన సమాచారాన్ని అందించి, ఇంటి యజమానులు అవసరమైన పత్రాలతో సిద్ధంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

క్రీడా పోటీల్లో కాసిపేట గురుకుల విద్యార్థుల సత్తా



పతకాలు సాధించినవారితో ఉపాధ్యాయులు

బెల్లంపల్లి: ములుగు జిల్లా జాకారం ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల విద్యాలయంలో ఈనెల 11 నుంచి 14వ తేదీ వరకు నిర్వహించిన పదో జోనల్‌స్థాయి ఆటల పోటీల్లో కాసిపేట సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటారు. అత్యధిక పతకాలు సాధించి, అండర్–14 విభాగంలో ఓవరాల్ ఛాంపియన్ షిప్ ట్రోఫీని దక్కించుకున్నారు. పోటీల్లో సత్తా చాటిన విద్యార్థులు శనివారం విద్యాలయానికి చేరుకున్నారు. వీరికి ప్రిన్సిపాల్ సంతోష్‌కుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనస్వాగతం పలికి సన్మానించారు. ఈసందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. జోనల్ మీట్‌లో తమ పాఠశాల విద్యార్థులు రాణించడం ఆనందంగా ఉందని చెప్పారు. విద్యార్థులు గెలుచుకున్న 20 పతకాల్లో ఎనిమిది బంగారు, ఆరు రజత, ఆరు కాంస్య పతకాలున్నట్లు తెలిపారు. లాంగ్‌జంప్, హైజంప్, షాట్‌పుట్, వాలీబాల్, డిస్కస్‌త్రో తదితర ఈవెంట్లలో తమ విద్యార్థులు ప్రతిభ చాటారని పేర్కొన్నారు. ఇందుకు దోహదపడిన పీడీ హరీశ్, పీఈటీ రాజేందర్, ఉపాధ్యాయులను అభినందించారు. కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్, జూనియర్ వైస్ ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమాదబీమాపై అవగాహన కల్పించాలి



హాజరైన ఏరియా అధికారులు

శ్రీరాంపూర్: సింగరేణి ఉద్యోగులు యూనియన్ బ్యాంక్, ఎస్‌బీఐ, కెనరా బ్యాంక్‌లలో సాలరీ అకౌంట్ కలిగి ఉండటంతో కలిగే ప్రమాద బీమా సౌకర్యంపై అవగాహన కల్పించాలని జీఎం(పర్సనల్) కవిత నాయుడు సూచించారు. కొత్తగూడెం కార్పొరేట్ కార్యాలయం నుంచి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా శ్రీరాంపూర్ ఏరియా అధికారులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్మినెంట్ ఉద్యోగులు ఈ బ్యాంక్‌లలో తమ వేతనాలు తీసుకునేలా ఖాతాలు కలిగి ఉండాలని పేర్కొన్నారు. వారితో కంపెనీకి ఉన్న ఒప్పందం మేరకు ప్రమాదబీమా సౌకర్యం ఉన్నట్లు తెలిపారు. ఇప్పటికే చాలా మంది ఖాతాలు కలిగి ఉన్నారని, మిగతావారు సత్వరమే ఖాతా పొంది బీమా సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కాంట్రాక్ట్ కార్మికులు హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకుల్లో ఖాతా కలిగి ఉంటే వారికీ బీమా సౌకర్యం ఉంటుందని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో సివిల్ జీఎం సూర్యనారాయణ, డీవైపీఎం దేవేందర్ రెడ్డి, సీనియర్ పీవోలు కాంతారావు, రణదీప్‌గౌడ్, సంతన్, పాల్ సృజన్, సురేందర్, అజ్మీరా రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

కుట్టు శిక్షణ సద్వినియోగం చేసుకోవాలి


- కలెక్టర్ కుమార్ దీపక్
- దేవాపూర్‌లో కేంద్రం ప్రారంభం



కుట్టు శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ కుమార్ దీపక్, ఎమ్మెల్యే గడ్డం వినోద్

కాసిపేట: మహిళలు కుట్టు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శనివారం మండలంలోని దేవాపూర్‌లో జిల్లా వయోజన విద్యాశాఖ, లయన్స్‌క్లబ్ ఆఫ్ బెల్లంపల్లి, స్త్రీశక్తి లయన్స్‌క్లబ్ ఆఫ్ దేవాపూర్, ఓరియంట్ గోల్డ్ సంయుక్తంగా ఏర్పాటు చేసిన కుట్టు శిక్షణ, అక్షరాభ్యాస కేంద్రాలను బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, ఇతర అధికారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కుట్టు శిక్షణ, అక్షరాభ్యాస కేంద్రం ద్వారా మహిళలు శిక్షణ పొందుతూ నిరక్షరాస్యులైన వయోజనులకు చదువు నేర్పిస్తున్నట్లు చెప్పారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలు స్వయం ఉపాధి పొందేలా ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని పేర్కొన్నారు. కేంద్రాల ద్వారా నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడంలో రాష్ట్రంలోనే కాసిపేట మండలం ముందంజలో ఉండటం అభినందనీయమన్నారు. ఇదే స్ఫూర్తితో జిల్లాలో నిరక్షరాస్యులైన వయోజనులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని సూచించారు. శిక్షణ పొందుతూ వయోజనులకు చదువు నేర్పించే మహిళలకు ప్రభుత్వం నుంచి ప్రోత్సాహకం అందించనున్నట్లు తెలిపారు. అనంతరం 100 రోజుల శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. నూతనంగా అక్షరాభ్యాస కేంద్రంలో చేరిన వయోజనులతో అక్షరాలు దిద్దించారు. అనంతరం కుట్టు శిక్షణ కేంద్రంలో కుట్టు మిషన్లను ప్రారంభించారు. ప్రభుత్వం నుంచి మంజూరైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా వయోజన విద్యాధికారి పురుషోత్తంనాయక్, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ తిరుపతి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్, ఓరియంట్ సిమెంట్ కంపెనీ జీఎం కులకర్ణి, తహసీల్దార్ భోజన్న, ఎంపీడీవో సత్యనారాయణసింగ్, కాంగ్రెస్ నాయకులు రత్నం ప్రదీప్, ఆడ జంగు, శంకర్, గడ్డం వర్ష, లయన్స్‌క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

‘ప్రజలకు నాణ్యమైన వైద్యం అందిస్తాం’



క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే కొక్కిరాల

మంచిర్యాలటౌన్: ప్రజలందరికీ నాణ్యమైన ఉచిత వైద్యం అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కాలేజీ ఆవరణలో రూ.23.75 కోట్లతో చేపట్టిన క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అనంతరం సాయికుంటలో రూ.40 కోట్లతో చేపట్టిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల భవన నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మంచిర్యాల ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించేందుకు 50 పడకల క్రిటికల్ కేర్ ఆస్పత్రి భవనాన్ని నిర్మిస్తున్నామని చెప్పారు. అత్యవసర కేసులకు ఇక్కడ అన్ని సదుపాయాలతో వైద్యం అందించనున్నట్లు తెలిపారు. మంచిర్యాలను మెడికల్ హబ్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. ఈ నెల 21వ తేదీ నుంచి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి రాష్ట్ర మంత్రులు దామోదర రాజనర్సింహ, దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హాజరవుతారని పేర్కొన్నారు. రెండున్నరేళ్లలో ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తి చేస్తామని చెప్పారు. ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలకు తాళం వేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమాల్లో ప్రభుత్వ మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ ఎండీ సులేమాన్, ప్రభుత్వ జనరల్ ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీశ్చంద్రరెడ్డి, నర్సింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ ఫాతిమా జూలియెట్, మంచిర్యాల మున్సిపల్ వైస్ చైర్మన్ సల్ల మహేశ్, కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధిహామీ తనిఖీలు



ప్రజావేదికలో డీఆర్డీవో కిషన్, ప్రత్యేకాధికారి

దండేపల్లి: మండలంలో ఏప్రిల్ 2023 నుంచి అక్టోబర్ 2024 వరకు ఉపాధిహామీ కింద చేపట్టిన వివిధ పనులపై 14వ విడత సామాజిక తనిఖీలో భాగంగా గ్రామాల్లో అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో డీఆర్డీవో కిషన్ సమక్షంలో శనివారం నిర్వహించిన ప్రజావేదికలో డీఆర్పీలు వెల్లడించారు. మండలంలో రూ.2,54,07,602 విలువైన పనులు చేపట్టగా, కూలీల వేతనాల కింద రూ.2,50,82,371, మెటీరియల్ కింద రూ.3,25,231 చెల్లించినట్లు వివరించారు. ఇందులో గుడిరేవు, నంబాల, చెల్కగూడ, కర్ణపేట, గూడెం గ్రామాల్లో చిన్నచిన్న అవకతవకలు జరగడంతో బాధ్యులకు జరిమానా విధించడంతోపాటు రికవరీకి ఆదేశించారు. కాగా, గ్రామస్థాయిలో రికార్డులు పూర్తిస్థాయిలో నిర్వహించలేదని డీఆర్పీలు ప్రజావేదికలో వెల్లడించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ప్రేంచంద్, మండల ప్రత్యేకాధికారి రవీందర్‌రెడ్డి, ఎంపీడీవో ప్రసాద్, ఎస్సార్పీ దేవేందర్, అంబుడ్స్‌మెన్ శివరాం, ఏపీవో దుర్గదాస్, డీఆర్పీలు, ఉపాధిహామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

వెజ్‌బిర్యానీలో బొద్దింక



బిర్యానీ ప్లేట్‌లో బొద్దింక

మంచిర్యాలక్రైం: జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో వెజ్ బిర్యానీలో బొద్దింక కనిపించింది. వివరాలు.. శనివారం సాయంత్రం ఓ వ్యక్తి బస్టాండ్ సమీపంలోని హోటల్‌కు వెళ్లి వెజ్ బిర్యానీ ఆర్డర్ చేశాడు. సర్వర్ తెచ్చిన వెజ్ బిర్యానీని కొంత తిన్న తర్వాత అందులో చనిపోయిన బొద్దింకను గమనించాడు. వెంటనే కౌంటర్‌పై ఉన్న సిబ్బంది వద్దకు వెళ్లి దానిని చూపించాడు. దీంతో ఇద్దరి మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. ఈ విషయమై సదరు వినియోగదారుడు స్థానిక ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌కు ఫోన్ ద్వారా ఫిర్యాదు చేసినట్లు తెలిపాడు. కానీ.. గంట గడిచినా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ హోటల్ వద్దకు రాలేదని, మళ్లీ ఫోన్ చేసినా స్పందించలేదని ఆరోపించాడు.

రైతు అనుబంధ పరిశ్రమలపై చర్చ

పాతమంచిర్యాల: రాష్ట్రంలోని రైతుల సమస్యలు, రైతుకు అనుబంధంగా రావాల్సిన పరిశ్రమలపై ఆల్ ఇండియా కిసాన్ కాంగ్రెస్ వైస్ చైర్మన్ ఏ కోదండరెడ్డితో శనివారం హైదరాబాద్‌లో చర్చించినట్లు భారతీయ కిసాన్ సంఘ్ జిల్లా అధ్యక్షుడు గుంటుక సత్యనారాయణ రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని రైతుల సమస్యలపై చర్చించినట్లు పేర్కొన్నారు. సమస్యల పరిష్కారానికి కృషి చేయనున్నట్లు తెలిపారు.

గ్రూప్–3కి సర్వం సిద్ధం

- జిల్లా వ్యాప్తంగా 48 కేంద్రాలు
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు
- హాజరుకానున్న 15,038 మంది
- పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్



ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కేంద్రాన్ని పరిశీలిస్తున్న మోతీలాల్, నరేందర్‌రెడ్డి, చక్రపాణి

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లాలో ఆది, సోమవారాల్లో నిర్వహించనున్న గ్రూప్–3 పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన పరీక్షాకేంద్రాల్లో ఏర్పాట్లను అదనపు కలెక్టర్ మోతీలాల్ శనివారం పర్యవేక్షించారు. మంచిర్యాల, నస్పూర్, హాజీపూర్, మందమర్రిలో 48 పరీక్షాకేంద్రాలు ఏర్పాటు చేశారు. 15,038 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారు. కేంద్రాల్లో శానిటేషన్, సీసీ కెమెరాల ఏర్పాటు, వాష్‌రూమ్‌లు, బెంచీలు, ఫ్యాన్లు, మహిళా అభ్యర్థుల కోసం ప్రత్యేక సౌకర్యాలు, విద్యుత్, తాగునీరు, వైద్యసేవలు తదితర ఏర్పాట్లు చేశారు. అభ్యర్థుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానాన్ని అమలు చేస్తున్నారు. ప్రతీ కేంద్రంలో పోలీస్, హెల్త్, టెక్నికల్ సిబ్బంది అందుబాటులో ఉంచేలా చర్యలు చేపట్టారు.

పరీక్షల వేళలివే..

ఉదయం 9నుంచి పరీక్షాకేంద్రాల్లోకి అభ్యర్థులను అనుమతించి 9.30 గంటల తర్వాత గేట్లు మూసివేస్తారు. 10 గంటల నుంచి 12.30 గంటల వరకు మొదటి పరీక్ష నిర్వహిస్తారు. మళ్లీ మధ్యాహ్నం 2నుంచి అభ్యర్థులను కేంద్రాల్లోకి అనుమతించి 2.30 గంటలకు గేట్లు మూసివేస్తారు. 3నుంచి 5.30 గంటల వరకు రెండో పరీక్ష నిర్వహిస్తారు. 18న ఉదయం సెషన్‌లో మూడో పరీక్ష 10నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు నిర్వహిస్తారు.

పరీక్షాకేంద్రాల వద్ద 144 సెక్షన్

జిల్లాలో గ్రూప్–3 పరీక్షల నిర్వహణకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు డీసీపీ భాస్కర్ తెలిపారు. కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందని పేర్కొన్నారు. కేంద్రాల సమీపంలో ప్రజలు గుమిగూడరాదని, జిరాక్స్ సెంటర్లు, దుకాణాలు మూసి ఉంచాలని సూచించా రు. పరీక్షాకేంద్రం పరిసర ప్రాంతాల్లో సభలు, ఊరేగింపులు, ర్యాలీలు నిర్వహించరాదని తెలిపారు. 150 మంది కానిస్టేబుళ్లు, 48 మంది ఎస్సైలు, 15మంది ఏఎస్సైలు, నలుగురు సీఐలతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. బందోబస్తును ఇద్దరు ఏసీపీలు పర్యవేక్షిస్తుంటారని తెలిపారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలకు తావు లేకుండా పకడ్బందీ చర్యలు చేపట్టనున్నట్లు పేర్కొన్నారు.

అభ్యర్థులు సకాలంలో చేరుకోవాలి

గ్రూప్–3 పరీక్షలు రాసే అభ్యర్థులు సకాలంలో కేంద్రాలకు చేరుకోవాలని కలెక్టర్ కుమార్‌దీపక్ ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్ష ఓఎంఆర్ విధానం ద్వారా జరుగుతుందని, ప్రతీ పేపర్‌లో 150 ప్రశ్నలకు 150 మార్కులు ఉంటాయని పేర్కొన్నారు. కేంద్రాల్లో అన్ని సౌకర్యాలు కల్పించినట్లు వివరించారు.

వేంపల్లి కేంద్రాన్ని సందర్శించిన ఆర్డీవో

మంచిర్యాలరూరల్(హాజీపూర్): హాజీపూర్ మండలం వేంపల్లిలోని ఎస్సార్ఆర్ కళాశాలలో ఏర్పాటు చేసిన గ్రూప్–3 పరీక్షాకేంద్రాన్ని శనివారం మంచిర్యాల ఆర్డీవో శ్రీనివాసరావు పరిశీలించారు. ఆది, సోమవారాల్లో పరీక్షలు నిర్వహించనుండగా కేంద్రంలో ఏర్పాట్లపై సమీక్షించారు. సీఎస్‌తో మాట్లాడి వసతుల గురించి తెలుసుకున్నారు. సిబ్బందికి సూచనలు చేశారు. ఈ కేంద్రంలో 264 మంది అభ్యర్థులు పరీక్ష రాయనున్నట్లు తెలిపారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ శ్రీనివాసరావు దేశ్‌పాండే, ఎస్సై గోపతి సురేశ్, గిర్దావర్ ప్రభు పాల్గొన్నారు.



కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో శ్రీనివాస్

బీసీ సమీకృత హాస్టల్ తనిఖీ



సరుకుల గురించి కాంట్రాక్టర్‌తో ఫోన్‌లో మాట్లాడుతున్న డీబీసీడీవో వినోద్

మంచిర్యాలఅర్బన్: స్థానిక బీసీ సమీకృత వసతిగృహాన్ని శనివారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధిశాఖ అధికారి (డీబీసీడీవో) వినోద్ తనిఖీ చేశారు. హాస్టల్ పరిసరాలు పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా? అని ఆరా తీశారు. వంటసామగ్రి, స్టాక్, హాజరు పుస్తకాలను పరిశీలించారు. టెండర్లలో సూచించిన బ్రాండెడ్ సరుకులు కాకుండా మరోపేరు కలిగిన నిత్యావసరాలు ఉండటాన్ని తప్పుబట్టారు. నేరుగా కాంట్రాక్టర్‌కు ఫోన్ చేసి సరుకులు మార్చాలని ఆదేశించారు. ఆయన వెంట బీసీ, ఎస్సీ, ఎస్టీ హాస్టళ్ల వార్డెన్లు శ్రీహరి, ధర్మానంద్‌గౌడ్, తిరుపతి ఉన్నారు.

‘గూడెం’ జాతర ఆదాయం రూ.35 లక్షలు



హుండీ డబ్బులు లెక్కిస్తున్న సిబ్బంది, సేవా సమితి సభ్యులు

దండేపల్లి: జిల్లాలోనే ప్రసిద్ధిగాంచిన మండలంలోని గూడెం శ్రీసత్యనారాయణస్వామి ఆలయానికి కార్తీక పౌర్ణమి జాతర ద్వారా రూ.35,12,224 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో శ్రీనివాస్ తెలిపారు. జాతర ఆదాయాన్ని శనివారం లెక్కించినట్లు పేర్కొన్నారు. ఇందులో వ్రతాల టికెట్ల ద్వారా రూ.13.26 లక్షలు, లడ్డూ, పులిహోర విక్రయాల ద్వారా రూ.5,86,610, ప్రత్యేక దర్శన టికెట్ల ద్వారా రూ.84,350, వివిధ రశీదుల ద్వారా రూ.4,300, అన్నదానం రశీదుల ద్వారా రూ.39,600 ఆదాయం వచ్చింది. అలాగే 58 రోజుల హుండీ ఆదాయాన్ని లెక్కించగా రూ.14,71,364 సమకూరింది. 10 గ్రాముల మిశ్రమ బంగారం, కిలో 100 గ్రాముల మిశ్రమ వెండి, 13 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చాయి. దేవాదాయ ధర్మాదాయశాఖ నిర్మల్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ రాజమౌళి, దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ పర్యవేక్షణలో చేపట్టిన హుండీ లెక్కింపులో అర్చకుడు సంపత్‌స్వామి, సిబ్బంది, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ సిబ్బంది, శ్రీసత్యనారాయణస్వామి సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

విద్యుత్ షాక్‌తో రైతు మృతి


పెద్ద భీమయ్య మృతదేహం

దండేపల్లి: మండలంలోని రాజుగూడ జీపీ పరిధిలోని కుంటలగూడ కట్టకు చెందిన రైతు మార్నేని పెద్ద భీమయ్య (49) సోలార్ విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. ఎస్సై ఉదయ్‌కిరణ్ కథనం ప్రకారం ..పెద్ద భీమయ్య శనివారం తెల్లవా రుజాము తాను కౌలుకు చేస్తున్న పొలానికి నీళ్లు పెట్టేందుకు వెళ్లాడు. ఉదయం 7 గంటలు దాటిన ఇంటికి రాకపోవడంతో భార్య సత్తవ్వ అక్కడికి వెళ్లింది. సోలార్ వైరు వద్ద విద్యుత్ షాక్ తగిలి కాలిన గాయాలతో భీమయ్య చనిపోయి ఉన్నాడు. మృతుడి కుమారుడు మహేశ్ ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెల్లడించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి..

తిర్యాణి: బైక్ అదుపుతప్పి గాయపడ్డ వ్యక్తి చికిత్స పొందుతూ మృతిచెందాడు. ఎస్సై మాధవ్ కథనం ప్రకారం..మండలంలోని మోర్రిగూడ గ్రామానికి చెందిన తిరుమల్‌రావు(42) శుక్రవారం రాత్రి పాత సమ్మక్క గద్దెల వద్ద బైక్ అదుపు తప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలైన అతన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందాడు. భార్య సీతాబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గడ్డి కట్టేమిషన్‌లో చేతులు ఇరుక్కుని గాయాలు

లోకేశ్వరం: గడ్డి కట్టేమిషన్‌లో రెండు చేతులు ఇరుక్కుని ఒకరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్తులు, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు.. మండలంలోని రాజేష్‌తండాకు చెందిన రైతు రాథోడ్ మిథున్ శనివారం తన పొలంలో గడ్డికట్టలు కట్టేందు మిషన్‌ను తీసుకెళ్లాడు. గడ్డి కట్టలు కట్టేక్రమంలో దానికి అమర్చిన దారం తెగిపోయింది. సరిచేసే క్రమంలో మిథున్ చేతులు మిషన్‌లో ఇరుక్కుపోవడంతో తీవ్ర గాయాలయ్యాయి. కుటుంబ సభ్యులు అతన్ని హైదరాబాద్‌కు తరలించగా చికిత్స పొందుతున్నాడు.

పురుగుల మందు తాగి ఒకరు ఆత్మహత్య


సందీప్ (ఫైల్)

ఇంద్రవెల్లి: పురుగుల మందు తాగి తాగిన వ్యక్తి ఆదిలాబాద్ రిమ్స్‌లో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు ఎస్సై సునీల్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండలంలోని దేవాపూర్‌కు చెందిన లొండే సందీప్ వ్యవసాయ పనులు చేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. గతకొన్ని రోజులుగా మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 14న భార్యభర్తల మధ్య చిన్న గొడవ జరిగింది. ఈక్రమంలో సందీప్ మద్యం మత్తులో గుర్తుతెలియని పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించారు. శనివారం సాయంత్రం చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు సందీప్ మృతదేహాన్ని పరిశీలించి వివరాలు సేకరించారు. తల్లి దయబాయి ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి భార్య కవిత, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు.

బాసరలో ఉద్రిక్తత

- ట్రిపుల్‌ఐటీ ముట్టడికి ఏబీవీపీ పిలుపు
- భారీగా మోహరించిన జిల్లా పోలీసులు
- రైల్వేస్టేషన్, ఆలయంలో అరెస్టులు
- ట్రిపుల్‌ఐటీ గోడ దూకిన నాయకులు
- ఏఎస్పీ ఆధ్వర్యంలో విస్తృత తనిఖీలు


రైల్వేస్టేషన్ వద్ద పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

భైంసా: బాసరలో శనివారం ఉదయం నుంచే ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఏబీవీపీ నాయకులు ట్రిపుల్‌ఐటీని ముట్టడిస్తామని పిలుపునిచ్చారు. ఇటీవల ట్రిపుల్‌ఐటీ విద్యార్థిని పూరి స్వాతిప్రియ ఆత్మహత్య ఘటనపై అక్కడికి వెళ్లిన నాయకులపై సెక్యూరిటీ సిబ్బంది దాడిచేశారు. ఇందులో సాయికుమార్ తీవ్రంగా గాయపడ్డాడు. దాడికి నిరసనగా ఏబీవీపీ నాయకులు ఇప్పటికే జిల్లాలో ఒకరోజు విద్యాసంస్థల బంద్‌కు పిలుపునిచ్చారు. తాజాగా ట్రిపుల్‌ఐటీ ముట్టడికి నిర్ణయించారు. హైదరాబాద్, కామారెడ్డి, నిజామాబాద్ తదితర ప్రాంతాల నుంచి నాయకులు వస్తున్నారన్న సమాచారం ఇంటలిజెన్స్ అధికారులు చేరవేశారు. అప్రమత్తమైన ఎస్పీ జానకీషర్మిల..పోలీసులను మోహరించేలా చర్యలు తీసుకున్నారు. భైంసా ఏఎస్పీ అవినాశ్‌కుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు.

వేకువజాము అరెస్టులు

బాసర రైల్వేస్టేషన్‌లో ఉదయం 4 గంటల సమయంలో తాండూరు రైలుకు 50 మందికిపైగా ఏబీవీపీ నాయకులు దిగారు. స్టేషన్‌లో పోలీసు సిబ్బంది వారిని అదుపులో తీసుకున్నారు. ఏబీవీపీ చలో బాసర ట్రిపుల్‌ఐటీ ముట్టడికి తరలివచ్చే వారిని అదుపులో తీసుకునేందుకు ముందుగా ఆటోలను సిద్ధంగా ఉంచారు. వేకువజామున అరెస్టుల పరంపర కొనసాగింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు సికింద్రాబాద్ నుంచి మహారాష్ట్ర వెళ్లే రైళ్లలో బాసర స్టేషన్‌లో దిగిన వారిని క్షుణ్ణంగా పరిశీలించారు. అనుమానం ఉన్న నాయకులను, విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. తాము వేరే పనిమీద వచ్చామని చెప్పినా వినిపించుకోలేదు. స్టేషన్‌లో ఏమి జరుగుతుందో విషయం తెలియక యాత్రికులు కొంత అయోమయానికి గురయ్యారు. తాండూరు, సంబాల్‌పూర్, నాందేడ్ ప్యాసింజర్ రైళ్లలో దిగిన యాత్రికులను తనిఖీలు చేశారు. కొందరు విద్యార్థులు బాసర ఆలయంలో సరస్వతీ అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడికి వెళ్లిన పోలీసులు వారిని లాక్కెళ్లి స్టేషన్‌కు తరలించారు. బాసర అంతటా పోలీసులు మోహరించడంతో ఏమి జరుగుతుందోనని అంతా హైరానా పడ్డారు.

భారీ భద్రత..

బాసర ట్రిపుల్‌ఐటీలో భారీ భద్రత ఏర్పాటు చేశారు. ప్రధాన ద్వారం వద్ద ఐడీకార్డులు ఉన్న విద్యార్థులనే లోనికి పంపించారు. అనుమానం ఉన్న ఏబీవీపీ నాయకులను, విద్యార్థులను అదుపులో తీసుకున్నారు. భైంసా, ముధోల్, కుంటాల, నిర్మల్, పెంబి, బాసర పోలీస్ స్టేషన్లకు విద్యార్థులను తరలించారు. బాసర క్యాంపస్‌లోకి కొత్తవారిని అనుమతించలేదు. ఎక్కడ యువకులు కనిపించిన పోలీసులు అక్కడికి వెళ్లి క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ జానకీషర్మిల.. ఎప్పటికప్పుడు భద్రతపై ఆరా తీశారు.

గోడ దూకి..

మహారాష్ట్ర వైపు నుంచి వచ్చిన ఏబీవీపీ నాయకులు, విద్యార్థులు ట్రిపుల్‌ఐటీ గోడ దూకి లోనికి వెళ్లారు. అప్రమత్తమైన సిబ్బంది వారిని అదుపులో తీసుకుని స్టేషన్‌కు తరలించారు. మరోవైపు ఉమ్మడి ఆదిలాబాద్ నుంచి వచ్చేవారిని ముధోల్ వద్ద అదుపులోకి తీసుకున్నారు.


ఏబీవీపీ నాయకులను అదుపులో తీసుకుంటున్న పోలీసులు


రైల్వేస్టేషన్‌లో పోలీసులు


బాసరలో ఏబీవీపీ నాయకులను లాకెళ్తున్న పోలీసులు

పార్లమెంట్ హౌస్‌లో కళాకారుల ప్రదర్శన


రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి, లోక్‌సభ స్పీకర్‌తో ఆదివాసీ కళాకారులు

ఇచ్చోడ: మండలంలోని దుబార్‌పేట్‌కు చెందిన సకల కళా సంక్షేమ సంఘం ఆదివాసీ కళాకారులు శుక్రవారం రాత్రి ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో ప్రదర్శన చేశారు. గుస్సాడీ, డెంసా తదితర నృత్యాలు ప్రదర్శించారు. బిర్సాముండా జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో భాగంగా ఈ ప్రదర్శన ఇచ్చారు. రాష్ట్రపతి ద్రౌపతి ముర్ము, ఉపరాష్ట్రపతి జగదీప్ ధనఖడ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలు కళాకారులను అభినందించారని సకల కళా సంక్షేమ డైరెక్టర్ కాత్లె శ్రీధర్ తెలిపారు.

స్క్రాప్ తరలిస్తున్న వాహనం పట్టివేత

మంచిర్యాలక్రైం: జిల్లాకేంద్రంలో ఎంసీసీ కంపెనీకి చెందిన స్క్రాప్‌ను దొంగిలించి అక్రమంగా తరలిస్తున్న వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై ప్రవీణ్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కొందరు గుర్తుతెలియని వ్యక్తులు ఎంసీసీ కంపెనీకి చెందిన ఇనుపసామగ్రి(స్క్రాప్)ను దొంగిలించి బొలెరో వాహనంలో ర్యాలీ ఘడ్‌పూర్ వైపు తరలిస్తున్నారు. కంపెనీకి చెందిన పెట్రోలింగ్‌లో ఉన్న సెక్యూరిటీ సిబ్బంది శనివారం ఉదయం ఆపే ప్రయత్నం చేశారు. స్క్రాప్ దొంగలు కొంత దూరం వెళ్లాక వాహనాన్ని వదిలేసి పారిపోయారు. వాహనంలో క్వింటాల్ ఇనుప సామగ్రిని గుర్తించి సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. సెక్యూరిటీ సిబ్బంది ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.

మూగజీవాల వేటగాళ్లపై చర్యలు

- ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు


మాట్లాడుతున్న ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు

మందమర్రిరూరల్: మూగజీవాల వేటగాళ్లపై చట్టపరమైన చర్యలు తప్పవని ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని సారంగపల్లి పంచాయతీ శివారు గల దుబ్బపల్లి అటవీప్రాంతంలో రెండు గేదెలు వేటగాళ్లు అమర్చిన విద్యుత్ తీగలకు బలైన విషయం తెలుసుకుని శనివారం ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎఫ్‌ఆర్వో మాట్లాడుతూ అటవీ ప్రాంతంలో వేటగాళ్లు మూగజీవాల కోసం సుమారు 600 మీటర్ల విద్యుత్ తీగలు అమర్చారని తెలిపారు. అనుమానం ఉన్న సండ్రోన్‌పల్లికి చెందిన ఐదుగురిని గుర్తించామన్నారు. వారి ఇళ్లకు వెళ్లి తనిఖీ చేయగా ఒకరిని అదుపులో తీసుకున్నామని తెలిపారు. విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు. ఆయన వెంట డిప్యూటీ ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సంతోష్, ఎఫ్‌బీవో రాజేశ్వరి తదితరులు ఉన్నారు.

అటవీ ప్రాంతమంతా గాలింపు

చెన్నాపూర్ శివారులో పులి సంచరిస్తుందనే పుకారుతో శనివారం సిబ్బందితో కలిసి అటవీ ప్రాంతమంతా గాలించినట్లు ఎఫ్‌ఆర్వో రత్నాకర్‌రావు తెలిపారు. ఒడిశా రాష్ట్రానికి చెందిన పత్తి సేకరించడానికి వచ్చిన కూలీలకు ఏదో జంతువు కనబడితే దానినే పులిగా చెప్పుకొచ్చినట్లు పేర్కొన్నారు. ప్రజలు అటవీప్రాంతంలోకి వెళ్లొద్దన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో వెళ్లాల్సి వస్తే సమూహంతో వెళ్లాలని ఏదైనా పులి తిరిగినట్లు పాదముద్రలు కనిపిస్తే ఫారెస్ట్ అధికారులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

గడ్డి వ్యాన్ దగ్ధం


దగ్ధమవుతున్న వ్యాన్

జన్నారం: మండలంలోని కామన్‌పల్లి సమీపంలో గడ్డి లోడ్‌తో వెళ్తున్న వ్యాన్ షార్ట్ సర్క్యూట్‌తో దగ్ధమైంది. స్థానికులు తెలిపిన వివరాలు.. మండలంలోని పొనకల్‌కు చెందిన డ్రైవర్ దుర్గం రవి శనివారం కవ్వాల్ నుంచి గడ్డి కొనుగోలు చేసుకుని వ్యాన్ లోడ్‌తో ఆదిలాబాద్ గోశాలకు వెళ్తున్నాడు. కామన్‌పల్లి నుంచి ప్రధాన కెనల్ మీదుగా కొంత దూరం వెళ్లగా 11 కేవీ విద్యుత్ లైన్ తీగలు మధ్యలో ఉన్నాయి. కర్రతో పైకి లేపే క్రమంలో రెండు వైర్లు తగిలి గడ్డికి మంటలు అంటుకున్నాయి. గడ్డితోపాటు వ్యాన్ దగ్ధమైంది. స్థానికులు గమనించి ఫైర్ అధికారులు, పోలీసులకు సమాచారం అందించారు. రోడ్డు బాగాలేకపోవడంతో అగ్నిమాపక వాహనం దూరంగా ఆపాల్సి వచ్చిందని ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపారు. డ్రైవర్ నిర్లక్ష్యమే ప్రమాదానికి కారణమని తెలుస్తోంది.

పీడీఎస్ బియ్యం పట్టివేత

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని జాతీయ రహదారి 44కు అనుకుని ఉన్న ఓ దాబా హోటల్ సమీపంలో 8.40 క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని పట్టుకున్నట్లు ఏఎస్సై సునీత తెలిపారు. ఆమె కథనం ప్రకారం..శుక్రవారం జాతీయ రహదారి 44పై వాహనాలు తనిఖీ చేస్తుండగా ఆదిలాబాద్ నుంచి మహారాష్ట్రకు రెండు ఆటోల్లో పీడీఎస్ బియ్యాన్ని తరలిస్తుండగా పట్టుకున్నామన్నారు. బియ్యం తరలిస్తున్న నలుగురి వద్ద నుంచి సెల్‌ఫోన్లు, రెండు ఆటోలు, బియ్యాన్ని స్వాధీనంచేసుకున్నామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రిమ్స్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న జైసింగ్ రాథోడ్

తాంసి: రిమ్స్ ఆధ్వర్యంలో ఐదేళ్ల పాటు అందించే వైద్యసేవలను పొన్నారి గ్రామస్తులు సద్వినియోగం చేసుకోవాలని డైరెక్టర్ జైసింగ్ రాథోడ్ అన్నారు. రిమ్స్‌లో నూతనంగా చేరిన మెడికోల ఆధ్వర్యంలో గ్రామాన్ని దత్తత తీసుకున్నారు. కార్యక్రమాన్ని డైరెక్టర్‌తో పాటు కళాశాల ప్రిన్సిపాల్ విద్యవిల్సన్ ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామంలో ప్రతీ ఐదు కుటుంబాలకు ఒక వైద్యుడిని నియమించి ఎప్పటికప్పుడు ఆరోగ్య పరీక్షలు నిర్వహిస్తామన్నారు. ఈ సేవలు ఐదేళ్ల పాటు ఉచితంగా అందించనున్నట్లు వెల్లడించారు. ఇందులో మాజీసర్పంచ్ అశోక్, మాజీ ఎంపీటీసీ రేఖ, వైద్యాధికారి శ్రావ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

అట్టహాసంగా రాష్ట్రస్థాయి బేస్‌బాల్ పోటీలు


క్రీడాకారులతో మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి

నిర్మల్‌టౌన్: జిల్లాకేంద్రంలోని ఎన్టీఆర్ మినీస్టేడియంలో ఎస్జీఎఫ్ ఆధ్వర్యంలో మూడు రోజుల్లో జరిగే రాష్ట్రస్థాయి అండర్–17 బాల, బాలికల బేస్‌బాల్ పోటీలు శనివారం అట్టహాసంగా ప్రారంభమయ్యాయి. 8 జిల్లాల నుంచి 8 జట్లు, 280 మంది క్రీడాకారులు, 16 మంది కోచ్‌లు పాల్గొన్నారు. మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి, సమత ఫౌండేషన్ చైర్మన్ సుదర్శన్ జెండా ఊపి పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిర్మల్‌లో రాష్ట్రస్థాయి పోటీలు నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు ఆటల్లో సత్తా చాటి జాతీయస్థాయిలో పతకాలు సాధించాలని ఆకాంక్షించారు. ఎస్జీఎఫ్ సెక్రెటరీ రవీందర్‌గౌడ్, ఆర్గనైజర్ వన్నెల భూమన్న, వ్యాయామ ఉపాధ్యాయులు భోజన్న, అన్నపూర్ణ, జమున, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

కొడుకుపై కత్తితో తండ్రి దాడి

- మద్యంమత్తులో ఘర్షణ
- రిమ్స్ ఆస్పత్రికి తరలింపు


రిమ్స్‌లో వైద్యం పొందుతున్న మెస్రం బాలాజీ

నార్నూర్: మద్యంమత్తులో తండ్రికొడుకులు ఘర్షణ పడ్డారు. ఆవేశానికి లోనైన తండ్రి కత్తితో కొడుకుపై దాడి చేశాడు. ఈ సంఘటన ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామంలో శనివారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. మెస్రం భుజంగ్‌రావు, ఆయన కుమారుడు మెస్రం బాలాజీ వ్యవసాయం చేస్తుంటారు. తాగిన మైకంలో ప్రతీరోజు గొడవ పడుతుండేవారు. శనివారం వ్యవసాయ పనులు ముగించుకుని ఇంటికి వచ్చిన తర్వాత మద్యంమత్తులో ఇద్దరూ ఘర్షణ పడ్డారు. దీంతో భుజంగ్‌రావు కత్తితో బాలాజీని కడుపులో పొడిచాడు. తీవ్ర గాయం కావడంతో అతడిని కుటుంబ సభ్యులు ఉట్నూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు ప్రథమ చికిత్స అనంతరం ఆదిలాబాద్ రిమ్స్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. రిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాలాజీ పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ విషయమై సీఐ రహీంపాషాను సంప్రదించగా.. ఎలాంటి ఫిర్యాదు అందలేదని పేర్కొన్నారు. కాగా, ఏ విషయమై ఇద్దరి మధ్య ఘర్షణ జరిగిందనే వివరాలు తెలియరాలేదు.


వృద్ధాశ్రమానికి తరలింపు

సాక్షి ఎఫెక్ట్..


వృద్ధుడిని తరలిస్తున్న ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు

మందమర్రిరూరల్: 'అందరూ ఉన్నా..అనాథలా' శీర్షికన ఈనెల 13న సాక్షిలో ప్రచురితమైన కథనానికి శనివారం ప్రజాసేవ వెల్ఫేర్ సొసైటీ సభ్యులు స్పందించారు. పట్టణానికి చెందిన వృద్ధుడు తిరుపతిరెడ్డి వద్దకు వెళ్లి వివరాలు సేకరించి మంచిర్యాలలోని వృద్ధాశ్రమానికి తరలించారు. కుటుంబసభ్యులతో మాట్లాడి అతన్ని వృద్ధాశ్రమానికి తరలించామని సొసైటీ వ్యవస్థాపక అధ్యక్షుడు అజీమొద్దీన్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా 'సాక్షి'కి కృతజ్ఞతలు తెలిపారు. సొసైటీ పట్టణ అధ్యక్షుడు నందిపాటి రాజ్‌కుమార్, కార్యదర్శి గాండ్ల సంజీవ్ పటేల్, జావీద్‌పాషా, దిలీప్, చందు ఉన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


పరిశీలిస్తున్న ఎస్సై రాహుల్ గైక్వాడ్

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో తాళంవేసి ఉన్న ఇంట్లో గుర్తుతెలియని వ్యక్తులు శుక్రవారం రాత్రి చోరీకి పాల్పడ్డారు. ఎస్సై రాహుల్ గైక్వాడ్ కథనం ప్రకారం..ముక్కెర రాజేశ్వర్ గౌడ్ నివాసంలోని పై పోర్షన్‌లో తాళం వేసిన ఇంట్లోకి దొంగలు చొరబడి రూ.10 వేల నగదు, ఐదు మద్యం బాటిళ్లు, ఇతర సామగ్రిని ఎత్తుకెళ్లారు. అదే కాలనీలోని కమటం రవీందర్, కొల్లూరి రాజు, రాపెల్లి రవి, ఆర్ విజయలక్ష్మి ఇళ్లల్లో చోరీకి యత్నించారు. సమాచారం అందుకున్న ఎస్సై అక్కడికి చేరుకుని సీసీ ఫుటేజీలను పరిశీలించారు. క్లూస్‌టీంలతో కలిసి విచారణ చేపట్టారు. రాజేశ్వర్‌గౌడ్ ఫిర్యాదుతో శనివారం కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వాకింగ్ చేస్తుండగా సెల్‌ఫోన్ చోరీ

భైంసాటౌన్: ఫోన్‌లో మాట్లాడుతూ నడుచుకుంటూ వెళ్తున్న వ్యక్తి సెల్‌ఫోన్‌ను చోరీ చేసిన ఘటన పట్టణంలో జరిగింది. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో అధ్యాపకుడిగా చేస్తున్న రాంచందర్ శనివారం సాయంత్రం భైంసా–నిర్మల్ మార్గంలో ఖడ్డ హోటల్ ప్రాంతంలో వాకింగ్ చేస్తూ ఫోన్‌లో మాట్లాడుతున్నాడు. బైక్‌పై వచ్చిన గుర్తుతెలియని దుండగుడు ఫోన్ లాక్కుని పారిపోయాడు. ఈమేరకు పోలీసులకు ఫిర్యాదు చేయనున్నట్లు బాధితుడు తెలిపాడు.

వరికోతకు వేళాయె..!

- సన్నద్ధమవుతున్న రైతులు
- వారంలో జోరందుకునే అవకాశం


కోతకు వచ్చిన వరిపంట

బెల్లంపల్లి: వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరిపంట కోతకు సిద్ధమైంది. ప్రస్తుతం అక్కడక్కడ కోతలు ప్రారంభం కాగా, మరో వారంలో జోరందుకోనున్నాయి. ఇందుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బెల్లంపల్లి అసెంబ్లీ నియోజకవర్గంలో 7 మండలాలు, రెండు వ్యవసాయ డివిజన్లు ఉన్నాయి. వీటి పరిధిలో 60 వేల పైచిలుకు ఎకరాల్లో వరి పంట సాగైనట్లు అధికారుల లెక్కలు వెల్లడిస్తున్నాయి. సీజన్ ప్రారంభంతోనే ఇతర ప్రాంతాల నుంచి హార్వెస్టర్లను లీజుకు తీసుకువచ్చి వరి కోతలు చేపట్టే అవకాశాలు కనిపిస్తున్నాయి.

పత్తితీతకు వెళ్తున్న కూలీలు

వరి కోతలు రాకముందే కూలీలు గ్రామాల్లో పత్తితీత పనులకు వెళ్తున్నారు. కిలో చొప్పున లెక్కకట్టి కూలీ చెల్లిస్తుండటంతో అక్కడికి వెళ్లేందుకు మొగ్గు చూపుతున్నారు. వరి కోత పనులకు వెళ్లడానికి ఆసక్తి చూపడం లేదు. ఐదారేళ్ల నుంచి రైతులు హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తోంది. ఇదే అదునుగా లీజుకు తీసుకువచ్చిన రైతులు హార్వెస్టర్ల అద్దె ధరకు ఏటా రూ.వందల్లో పెంచుతున్నారు. అద్దె ధర అధికమైనప్పటికీ హార్వెస్టర్లతో వరికోత పనులు పూర్తి చేసుకుంటున్నారు. ప్రస్తుతం వీటి పనులు మొదలు కానుండటంతో గ్రామాల్లో సందడి నెలకొననుంది.

కూలీలు రావడం లేదు

వరి కోతలకు ఏటా కూలీల సమస్య ఏర్పడుతోంది. గ్రామాల్లో పత్తి తీత పనులు సాగుతున్నాయి. వరికోత పనులకు కూలీలకు రావడం లేదు. హార్వెస్టర్లపై ఆధారపడాల్సి వస్తుంది.

– గోమాస మల్లయ్య, రైతు, బెల్లంపల్లి మండలం